




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :173 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ గురువారం- 23 - జూలై- 2026


## తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని

దారుణాలకు ఒడిగట్టాడన్న అచ్చెన్నాయుడు

బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించారని మండిపాటు

తప్పు చేసిన వారిని ప్రభుత్వం చట్టప్రకారం శిక్షిస్తుందని వ్యాఖ్య



అమరావతి : వైసీపీ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూ భాగోతాలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం దారుణమన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించి సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

రబీకి సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ఆమోదం

సేకరించే ధాన్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు

ప్రధాని మోదీకి కృతజ్ఞత తెలిపిన కేంద్రమంత్రులు



హైదరాబాద్: తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, మిగతా..2లో

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన



- లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్న కవిత
- ఆదాయం కుటుంబ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన
- వీరంతా నిరసనబాట పట్టే అవకాశం ఉందని హెచ్చరిక

హైదరాబాద్: స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను

# బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి

- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్: నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మ గాంధీ సిద్ధాంతాలను మిగతా..2లో

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ డ్రామాలే

- వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందన్న సంజయ్
- రాహుల్ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం బీజేపీకే లాభమని వ్యాఖ్య
- రాష్ట్రంలో ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన




అమరావతి : నీట్ వివాదం, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆందోళన డ్రామాలకు తెరదీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం అది బీజేపీకే లాభమని, ఆయన తమ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. ప్రధాని నివాసం వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని, నీట్ అంశంపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, రాహుల్ కాబోయే ప్రధాని అని రేవంత్ రెడ్డి అనడం పెద్ద జోక్ అని కొట్టిపారేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ కేవలం రాజకీయ నాటకాలేనని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశ వ్యవస్థ అక్రమాలకు అడ్డాగా మారింది- ఈ దశాబ్దంలో

# 152 పరీక్షల పత్రాలు లీక్

- నీట్ అంశం, ప్రతిపక్షాల ఆందోళనలపై కాంగ్రెస్ ఎంపీ సమావేశం
- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్న రాహుల్ గాంధీ
- దశాబ్దకాలంలో 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని వ్యాఖ్య



ఢిల్లీ : ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పేరుగాంచిన మన దేశ విద్యా వ్యవస్థ, నేడు అక్రమాలకు నిలయంగా మారిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. అలాగే దశాబ్ద కాలంలో 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని, 7.50 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంత నష్టపోయినా, ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదని మండిపడ్డారు. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని, డిమాండ్లు పరిష్కరించాలని మిగతా..2లో

## నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయడమే ఏకైక పరిష్కారం

ఢిల్లీలోని నిరసనలకు మద్దతు ప్రకటించిన సీఎం విజయ్




- నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలకు మద్దతు ప్రకటించిన విజయ్
- వైద్యవిద్యను రాష్ట్ర జాబితాలో చేరిస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వెల్లడి

ఢిల్లీ : నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులు, ప్రజల మనోభావాలను కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా గౌరవించాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు.

## స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ కు కట్టుబడి ఉన్నాం

- ఆసియాన్ కూటమికి అండగా క్వాడ్ దేశాలు
- మనీలా సమావేశంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ : ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛగా ఉంచడానికి కట్టుబడి ఉన్నామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన క్వాడ్ కూటమి సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో జైశంకర్ తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, పెన్నీ వాంగ్, తోషిమిట్సు మొటెగి పాల్గొన్నారు. ఈ క్వాడ్ విదేశాంగ మంత్రులు ఇంతకుముందు మే చివరి వారంలో ఢిల్లీలో సమావేశం అయ్యారు. ఆ సమయంలో మార్కో రూబియో భారత పర్యటనకు వచ్చారు. "మనీలాలో జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇండో -పసిఫిక్ ప్రాంత పరిస్థితులను సమీక్షించాము. ఇటీవల జరిగిన పరిణామాలపై చర్చించాం. ఢిల్లీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మేం అనుసరించాం. ఆసియాన్ ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, స్వేచ్ఛా, సమ్మిళిత ఇండో - పసిఫిక్ ప్రాంతానికి మేము కట్టుబడి ఉన్నాం" అని జైశంకర్ ఎక్స్ వేదికగా తెలిపారు.

### మోస్ట్ పవర్ ఫుల్

అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏసియన్ నేషన్స్ (ఆసియాన్) అనేది మిగతా..2లో

## ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం




- మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పేదలకు శాశ్వత పట్టాల పంపిణీ
- మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్న మంత్రి
- రూ.1800 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కేంద్ర నిధులతో ఎంపీ పెమ్మసాని సహకారంతో అభివృద్ధి పనులు

అమరావతి : మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని,

## సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్ - భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి

# రావాలని ప్రధాని మోదీకి ఆహ్వానం

- ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానిని ఆహ్వానం
- ఆగస్టు 1న ప్రారంభోత్సవానికి వస్తానని చంద్రబాబు బృందానికి చెప్పిన ప్రధాని



అమరావతి : సీఎం చంద్రబాబు ఢిల్లీలో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రధాని మోదీ సహా పలువురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానికి సీఎం ఆహ్వానం పలికారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలపై కేంద్రమంత్రులతో చర్చించారు. గోదావరి - కావేరి అనుసంధానంపై రాష్ట్రాలతో చర్చించాలని సీఎం కోరగా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారు. ఆగస్టు 1న జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తానని ప్రధాని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ప్రధాని పరిచయం చేసిన సీఎం ఈయనే స్థానిక ఎంపీ అని చెప్పారు. అప్పలనాయుడు తనకు తెలుసని ఆయన రోజూ సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తారని ప్రధాని చెప్పారు. తాజా రాజకీయ పరిస్థితులపైనా ప్రధాని, సీఎం మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గంగా, కావేరి నదుల అనుసంధానంపైనా మోదీ, చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. సీఎంతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, మిగతా..2లో

## రైతులు త్వరగా భూసమీకరణకు వస్తే పనులు చేపడతాం




- రైల్వే లైన్, అవుటర్ రింగ్ రోడ్, కొండవీటి వాగు విస్తరణకు భూములు
- గుంటూరు జిల్లా తాడికొండలో గ్రామసభ
- 4 వేల ఎకరాలు సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదన

అమరావతి : అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైల్వే లైన్, అవుటర్ రింగ్ రోడ్, కొండవీటి వాగు విస్తరణకు

మొదటి పేజి తరువాయి

## స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ కు కట్టుబడి ఉన్నాం

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత ప్రభావవంతమైన కూటముల్లో ఒకటిగా ఉంది. ఇందులో భారత్, అమెరికా, చైనా, జపాన్ , ఆస్ట్రేలియా సహా పలుదేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. కాగా, మనీలా జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా వారంతా ఒక ఉమ్మడి ప్రకటన చేశారు. స్వేచ్ఛా, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని బలోపేతం చేసేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆసియాన్ ఐక్యత, ప్రాధాన్యాలకు పూర్తి మద్దతును ఇవ్వడానికే తాము సమావేశమయినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక ప్రాబల్యం, చర్యలు పెరుగుతున్న నేపథ్యంలో, శాంతి, స్థిరత్వాన్ని నిర్ధరించడానికి విస్తృత సహకారం అందించాలని క్వాడ్ దేశాలు సంకల్పించాయి. తాము ఈ ప్రాంతం స్వేచ్ఛ కోసం, ఆసియాన్ దేశాలతో కలిసి పనిచేయడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని ప్రకటించాయి. ఈ సమావేశంలో ప్రాంతీయ సవాళ్లు, అవకాశాల గురించి క్వాడ్ మంత్రులు చర్చించారు. వారి ప్రకటన ప్రకారం, సముద్ర, అంతర్జాతీయ భద్రత, ఆర్థిక శ్రేయస్సు, రక్షణ, కీలకమైన సాంకేతికతలు, మానవతా సాయం, అత్యవసర స్పందన లాంటి ఉమ్మడి ప్రాధాన్యతలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇండో-పసిఫిక్ సముద్ర పరిధిలో శాంతి, స్థిరత్వం అనేవి ఈ ప్రాంత భద్రత, శ్రేయస్సుకు పునాది అని మేము బలంగా నమ్ముతున్నాము" క్వాడ్ విదేశాంగ మంత్రులు ఉమ్మడి ప్రకటన చేశారు.

### రూబియోతో జైశంకర్ భేటీ

ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భేటీ అయ్యారు. భారత్ -అమెరికా సమగ్ర ప్రపంచవ వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన కీలక రంగాలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. "మనీలాలో రూబియోను కలవడం సంతోషంగా ఉంది. భారత్-అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాలైన వాణిజ్యం, సుంకాలు, ఇంధనం, రక్షణ, భద్రత, కీలక ఖనిజాలు, ఏఐ లాంటి అంశాలపై మా సమావేశంలో ప్రధానంగా చర్చించాం. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ, బహుపాక్షిక పరిణామాలపై అభిప్రాయాలను పంచుకున్నాం" అని జైశంకర్ ఎక్స్ వేదికగా తెలిపారు. అంతకు ముందు జైశంకర్ ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి సెనేటర్ పెన్నీ వాంగ్ , ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యదర్శి మా.థెరిసా పి.లాజారోలతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిపారు. ఆసియాన్ ఫ్రేమ్ వర్క్ పరిధిలో ఆసియాన్ -ఇండియా విదేశాంగ మంత్రుల సమావేశం, తూర్పు ఆసియా సదస్సు (ఈఏఎస్ ) విదేశాంగ మంత్రుల సమావేశం, ఆసియాన్ ప్రాంతీయ ఫోరమ్ (ఏఆర్ ఎఫ్ ) సమావేశాలు జరుగుతాయి. వీటితో పాటు పలు మంత్రిత్వ స్థాయి సమావేశాల్లో పాల్గొనేందుకు జైశంకర్ రెండు రోజుల పర్యటన నిమిత్తం మనీలాకు వెళ్లారు.

## తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

శ్రీకాకుళం జిల్లా పరువు తీసిన వారిని ధర్మాన వంటి నేతలు వెళ్లి పరామర్శించడం, జగన్ వారిని సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపులు తమ సంస్కృతి కాదని, తప్పు చేసిన ఎవరినైనా కూటమి ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించి తీరుతుందని స్పష్టం చేశారు. గతంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన జగన్, ఇప్పుడు వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి ఉత్తుత్తి సమావేశాలు నిర్వహిస్తున్నారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలు తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడారని తెలిపారు. కేంద్ర మంత్రులు కూడా నేరుగా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. ఢిల్లీ స్థాయిలో ఈ చర్చలు ఫలవంతం కావడంతో, ఆ క్రెడిట్ ఎక్కడ చంద్రబాబుకు దక్కుతుందోనన్న భయంతోనే జగన్ సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం రైతుల ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

### ప్రధాని మోదీ జోక్యం చేసుకుని

## ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి

పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ డ్రామాలే

కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంగా కూడా చూడటం లేదని, సీజేపీతో పోటీ పడేందుకే ఈ తరహా నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు, తెలంగాణలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే, ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలు మాని వెంటనే రైతులకు నీరందించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

## కాంగ్రెస్ చలో లోక్‌భవన్ ఉద్రిక్తం - పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్

రాహుల్‌గాంధీ, విపక్షనేతల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ చలో లోక్‌భవన్

నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ - మంత్రులు, కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు

ఢిల్లీ : దిల్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్‌భవన్" ర్యాలీ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకుని కాంగ్రెస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసి లోక్‌భవన్ పరిసరాలను పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దిల్లీలో నిన్న రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ చలో లోక్‌భవన్ ఉద్రిక్తం - పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్

కాంగ్రెస్ ర్యాలీని దృష్టిలో ఉంచుకుని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మొదలైన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో ప్రధాన కూడలి వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ముందే మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ర్యాలీని నిలిపివేశారు. పోలీసుల అడ్డుకట్టను దాటేందుకు కొందరు కార్యకర్తలు ప్రయత్నించడంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అప్పటికే మోహరించిన పోలీసు బలగాలకు అదనంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందిని, మహిళా కానిస్టేబుళ్లను రప్పించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇదే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీ సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్ - భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి రావాలని ప్రధాని మోదీకి ఆహ్వానం

మొదటి పేజి తరువాయి

ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు ప్రదానిని కలిశారు. పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై చర్చ: కేంద్రమంత్రి సీఆర్.పాటిల్ తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై ఇరువురు చర్చించారు. పోలవరం సందర్శనకు రావాలని సీఎం పాటిల్‌ను కోరారు. ప్రాజెక్ట్ వర్క్ స్టాప్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేసేలా చూడాలని సీఎం కోరారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించాలని అన్నారు. పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల పురోగతిపై చర్చించారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపైనా ఇరువురి మధ్య చర్చ జరిగింది. పోలవరం-బనకచర్ల వల్లే కావేరి అనుసంధానం ఆలోచన వచ్చిందని కేంద్ర అధికారులు చెప్పారు. బనకచర్ల-కావేరి అనుసంధానంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకోవడం మంచిదని సీఎం అన్నారు. గోదావరి నుంచి శ్రీశైలానికి తెస్తే మహారాష్ట్ర వాటా అడుగుతుందేమోనని అధికారులు అడగ్గా నీటిని అందరూ సమానంగా తీసుకుంటే నష్టం ఏముందని సీఎం అన్నారు. శ్రీశైలం నుంచి గ్రావిటీతోనే కావేరికి నీళ్లు చేరుకుంటాయని స్పష్టం చేశారు. గ్రావిటీతో చేరుకుంటే ఖర్చు కూడా బాగా తగ్గుతుందని పాటిల్ అన్నారు. శ్రీశైలం నుంచి కాకుంటే బనకచర్ల నుంచి అనుసంధానించడంపై చర్చించాలని సీఎం సూచించారు. అయితే శ్రీశైలం కంటే బనకచర్ల నుంచే తమకు సులువని జలశక్తి శాఖ అధికారులు బదులిచ్చారు. పోలవరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్న సీఎం గోదావరి-కావేరి అనుసంధానంలో భారం తగ్గుతుందని చెప్పారు. భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ: పోలవరం కాలువను శ్రీకాకుళం వరకు తీసుకెళ్లడాన్ని పరిశీలించాలని సీఎం సీఆర్ పాటిల్‌ను కోరారు. మహానది-వంశధార అనుసంధానంలో శ్రీకాకుళం ఉంటుందని కేంద్ర అధికారులు బదులిచ్చారు. గోదావరి-కావేరి అనుసంధానంపై మిగతా రాష్ట్రాలనూ ఒప్పించాలని సీఎం కోరారు. భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో భేటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్న పాటిల్ 3 వారాల్లోనే సమావేశం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. సముద్రంలోకి నీరు వృథాగా పోవడం కంటే ఉపయోగించుకుంటే మంచిదన్న సీఎం ఈ అంశంపై జలశక్తి శాఖ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రాల ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. చంద్రబాబు చేసిన అన్ని రాష్ట్రాలతో భేటీ ప్రతిపాదనను పాటిల్ అంగీకరించారు. కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ సీఎం విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై పీయూష్ గోయల్‌కు వినతులు అందించారు. మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం భేటీలో రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

## రైతులు త్వరగా భూసమీకరణకు వస్తే పనులు చేపడతాం

మొదటి పేజి తరువాయి

భూములు సమీకరించేందుకు గుంటూరు జిల్లా తాడికొండలో గ్రామసభ నిర్వహించారు. 3 ప్రాజెక్టులకు కలిపి తాడికొండ గ్రామ పరిధిలో 4,000 ఎకరాలకు పైగా సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను మంత్రి నారాయణ తెలుసుకున్నారు. 6 రేట్ల పరిహారం ఇవ్వాలని కోరిన రైతులు : గుంటూరు జిల్లా తాడికొండలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. అమరావతి రైల్వేలైన్, ఇన్నర్ రింగ్‌రోడ్, రాజధాని రేడియల్ రోడ్ల కోసం తాడికొండ పరిధిలో 4,348 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు సానుకూలంగా స్పందించారు. రైల్వే, రోడ్డు కనెక్టివిటీ పనుల కోసం భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇద్దరు రైతులు తమ సంసిద్ధత పత్రాలను కూడా అందించారు. అయితే, ఎర్రుపాలెం లాగే ఇక్కడ కూడా 6 రెట్లు పరిహారం ఇవ్వాలని, ప్లాట్లు ఎక్కడ కేటాయిస్తారో ముందే స్పష్టంగా చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్న తమ అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంతర్గత రహదారుల విస్తరణ పేరుతో ఇబ్బంది పెట్టవద్దని భూములిచ్చిన రైతులు కోరారు. తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

### రైతులు త్వరగా భూసమీకరణకు వస్తే పనులు చేపడతాం

"రైతులు చెప్పిన అంశాలు, అభ్యంతరాలు నోట్ చేసుకున్నాం. 2015లో భూ సమీకరణ మొదలైనా పనులు మాత్రం 2018లో మొదలయ్యాయి. జగన్ హయాంలో ఐదేళ్లు పనులు జరగలేదు. మళ్లీ మా ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన భవనాలు అతిత్వరలో వినియోగంలోకి తెస్తున్నాం. ఇప్పుడు రైల్వే లైన్, రింగ్‌రోడ్ కోసం భూములు కావాలి. రైతులు త్వరగా భూ సమీకరణకు వస్తే పనులు చేపడతాం. తాడికొండ నుంచి రాజధాని వెళ్లే రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తాం"- నారాయణ, మంత్రి అభ్యంతరాలు నోట్ చేసుకున్న మంత్రి : రాజధాని అమరావతి విషయంలో జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై రైతులు సందేహాలు లేవనెత్తారు. భూసమీకరణతో పాటు భూసేకరణకు కూడా అవకాశం కల్పిస్తే తమ ఇష్టం వచ్చిన విధానాన్ని ఎంచుకుంటామని కొందరు రైతులు తెలిపారు. ఇద్దరు రైతులు గ్రామసభలోనే భూసమీకరణకు తమ అంగీకారాన్ని తెలియజేస్తూ పత్రాలు అందజేశారు. అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైతుల అభ్యంతరాలన్నింటినీ నోట్ చేసుకున్నామని మంత్రి నారాయణ ఈ సభలో స్పష్టం చేశారు.

## ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్న లోకేశ్

మొదటి పేజి తరువాయి

రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

### భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

### ఓటమి నేర్పిన పాఠం.. ప్రజల మనసు గెలిచా



2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.

### మోడల్ నియోజకవర్గమే లక్ష్యం

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల ప్రయాణం

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని లోకేశ్ అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నేటి నుంచి నిధులు జమ చేస్తున్నామని, 4 వేల రూపాయల పింఛను, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేయడం వల్లే కేంద్రం నుంచి నిధులు సులభంగా వస్తున్నాయని, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యవస్థ అక్రమాలకు అడ్డాగా మారింది- ఈ దశాబ్దంలో 152 పరీక్షల పత్రాలు లీక్

మొదటి పేజి తరువాయి

మాత్రమే యువత కోరుతోందని తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. లాఠీఛార్జ్‌లో విద్యార్థులు గాయపడడం సహా వారి ఆక్రందనకు సంబంధించిన దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు. "గత పదేళ్లలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు జరిగాయి, కానీ ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. అంటే ఎవరో ఒకరు లేదా ఒక బృందం మన విద్యా వ్యవస్థను, అంటే దేశపు అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేసి, మన విద్యార్థుల జీవితాలను దెబ్బతీశారు. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది? శిక్షలు మాత్రం పడడంలేదు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే. అలాగే, దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. పరీక్షల విధానంలో మార్పులు తీసుకురావాలి. నిరసనలో జరిగిన గాయాల గురించి బాధపడటం లేదు, ఇంకా ఎన్ని దెబ్బలకైనా సిద్ధం. కానీ, విద్యార్థులకు జరుగుతున్న నష్టం విషయంలోనే బాధ కలుగుతోంది. అందుకే విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నాం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తున్నారు, జలఫిరంగులు వాడుతున్నారు. ఆందోళన చేసేవాళ్లు, ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులు కాదు. విద్యార్థులంటే మన దేశ భవిష్యత్, మన ఆశలు."

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

### అదంతా దోపిడే

"ఒక పరీక్ష రాయడానికి విద్యార్థుల కుటుంబాలు పెట్టే ఖర్చు, మొత్తం విద్యా బడ్జెట్‌కు సమానం. భారత ప్రభుత్వం, పన్నులన్నీ వసూలు చేసిన తర్వాత, మన పిల్లల భవిష్యత్తు కోసం డబ్బు ఖర్చు చేస్తుంది. ఆ నిధులే 'విద్యా బడ్జెట్'గా పరిగణిస్తారు. దాని విలువ రూ. 1.4 లక్షల కోట్లు. ప్రతి సంవత్సరం ఇదే సమయంలో, నీట్ పరీక్ష రాసే కుటుంబాలు దాదాపు అంతే మొత్తంలో రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇది ఆ కుటుంబాలను నిలువునా దోచుకోవడమే తప్ప మరొకటి కాదు. పైగా, వారిని అలా దోచుకున్న తర్వాత, చివరకు 'ప్రశ్నపత్రం లీక్ అయ్యింది' అని చెబుతారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

### 'అవినీతికి తలుపులు బార్లా తెరిచారు'

కేంద్ర విధానాల వల్ల అంబానీ, అదానీకి ఎలాంటి నష్టం లేదని,



కేవలం పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో యువతకు సరైన ఉద్యోగాలు లేవని, దేశంలో తయారీ, వ్యాపార రంగాలు మూతపడ్డాయని, చైనా వస్తువుల సంఖ్య పెరిగిందని దుయ్యబట్టారు. అలాగే, బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారని, ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారీ వ్యవస్థలో అవినీతికి తలుపులు బార్లా తెరిచారని ఆరోపించారు. అయితే, విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్ పూర్తిగా మద్దతిస్తోందని, దానిని రాజకీయాలకు వాడుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం తన బాధ్యత అని పేర్కొన్నారు.

## నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయడమే ఏకైక పరిష్కారం

మొదటి పేజి తరువాయి

నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయడమే ఈ సమస్యకు ఉన్న ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ అంశంపై దిల్లీలో ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనకు విజయ్ తన పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. దిల్లీలో నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన విజయ్, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని చెప్పారు. నీట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని విజయ్ పునరుద్ఘాటించారు. వైద్యవిద్యను రాష్ట్ర జాబితాలో చేర్చడం ఈ సమస్యకున్న శాశ్వత పరిష్కారమని వెల్లడించారు. ఇందుకు న్యాయపరంగా ఏవైనా అడ్డంకులుంటే వాటిని తొలగించే వరకు తాత్కాలికంగా ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని విజయ్ సూచించారు. 'నీట్ వంటి పరీక్షలను రద్దు చేయాలంటే, ముందుగా విద్యారంగాన్ని 'రాష్ట్ర జాబితా' పరిధిలోకి మార్చాలి. అదే ఏకైక శాశ్వత పరిష్కారం. ఒకవేళ దీనికి ఏవైనా చట్టపరమైన లేదా విధానపరమైన అడ్డంకులు ఉంటే, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించేందుకు మధ్యంతర చర్యగా ఒక 'ప్రత్యేక ఉమ్మడి జాబితా'ను రూపొందించాలి. దీనివల్ల సాధారణ, వైద్య విద్యతో సహా వివిధ అంశాలపై రాష్ట్రాలు పూర్తి అధికారాన్ని వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. శాశ్వత, మధ్యంతర పరిష్కారాల విషయంలో మా దృక్పథం ఇదే. మా



పార్టీ ఆవిర్భావ సమయంలో విద్యా పురస్కారాల ప్రదానోత్సవంలోనే ఈ విషయాన్ని బలంగా నొక్కి చెప్పాం.'

**- విజయ్ , తమిళనాడు ముఖ్యమంత్రి**

విద్యార్థుల అరెస్టుతో భగ్గుమన్న విపక్షాలు ఇక, పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ గత కొద్దిరోజులుగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టింది. అయితే, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్ చుక్ ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. దీంతో సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర రూపం దాల్చింది. చలో పార్లమెంటుకు సీజేపీ పిలుపునివ్వడంతో సోమవారం నాటికి వేల మంది దిల్లీకి చేరుకున్నారు. సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణంతో పలుచోట్ల పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. అయితే, ఈ తీవ్రమైన ఘర్షణ వాతావరణంతో ఆ ప్రాంతంలో చాలా మందికి రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. మరోవైపు, నిరసనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం సీజేపీతో చర్చలు జరిపింది. కేంద్ర మంత్రి నడ్డాతో జరిగిన చర్చల్లో తమ డిమాండ్లపై సానుకూల స్పందన వచ్చినట్లు సీజేపీ తెలిపింది. అయితే, ఈ డిమాండ్లలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కీలకం కావడం గమనార్హం. ఇక ఆందోళనలకు కేంద్ర బిందువుగా నిలిచిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి సుదీర్ఘంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే అందుకు సంబంధించిన వివరాలేమీ తెలీలేదు. మరోవైపు, శాంతియుతంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ట్విట్టర్ వేదికపై కేంద్రప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తదితర ప్రముఖులు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# సంపాదకీయం

## మహిళాలోకానికి స్ఫూర్తి ముత్తులక్ష్మి

మొదటివారు అని వివిధ రంగాల్లో పేర్కొన్న వ్యక్తులు చాలామంది ఉంటారు. కానీ అనేక రంగాల్లో మొదటివారిగా పేర్కొనగలవారు అరుదుగా ఉంటారు. మన దేశంలో తొలి శాసన సభ్యురాలు, పురుషుల వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన తొలి మహిళ, సర్జరీ విభాగంలో ప్రవేశం పొందిన తొలి భారతీయ మహిళ, సోషల్ వెల్ఫేర్ బోర్డు తొలి చైర్‌పర్సన్, శాసనసభకు తొలి ఉపాధ్యక్షురాలు, మద్రాసు మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా కార్పొరేటర్. ఇన్ని ప్రత్యేకతలు సాధించిన స్త్రీమూర్తి డా. ముత్తులక్ష్మిరెడ్డి. ఈమె తల్లి చంద్రమాళ్... దేవదాసి. ఆమెను పెళ్లి చేసుకున్నందువల్ల తండ్రి నారాయణస్వామిని వెలివేశారు. 1986 జూలై 30న జన్మించిన ముత్తులక్ష్మి ఈ వివక్షతల మధ్యే పెరిగారు. చిన్నతనం నుంచి దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలు, పురుషాధిక్యత, ఒంటరి మహిళల వేదనలు ఆకళింపు చేసుకున్నారు. మహిళలకు ప్రవేశంలేని రోజుల్లో పుదుక్కోట రాజు తొండమాన్ సహకారంతో వైద్య కళాశాలలో చేరి, పురుష విద్యార్థులకు కన్పించకుండా ఏర్పాటు చేసిన పరదాల మధ్య కూర్చుని విద్యాభ్యాసం పూర్తిచేసి 1912లో వైద్యురాలయ్యారు. దేవదాసి కుటుంబం నుంచి వచ్చిన తల్లి... కూతురికి భద్ర జీవితం కోసం చిన్న వయస్సులోనే పెళ్లి చేయాలనుకుంది. కానీ తండ్రీకూతుళ్లు పడనివ్వలేదు. వివాహ బంధానికి దూరంగా ఉండాలనుకున్న ముత్తులక్ష్మి.. తన ఆశయాలకు ఆటంకం కల్గించడని నమ్మకం కుదిరిన తర్వాత, డా. టి.సుందరరెడ్డిని 1914లో వివాహం చేసుకున్నారు. 1947 అక్టోబర్ 8న మద్రాసు శాసనసభలో సహచర సభ్యులు రామసామిరెడ్డితో కలిసి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం తీర్మానం పెట్టారు. దాన్ని సనాతనవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. చర్చ అనంతరం చివరకు దేవదాసీ నిర్మూలన చట్టాన్ని శాసనసభ ఆమోదించింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న కోస్తా రాయలసీమల్లోని 'మాతమ్మ', 'జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతాలలోని 'నంగా', కన్నడ ప్రాంతంలోని 'బసవ' లాంటి అనాగరిక వ్యవస్థలన్నీ రద్దయ్యాయి. ఈ కాలంలోనే బాలికల వివాహ వయస్సు 16 సంవత్సరాలకు పెంచాలని శాసనసభలో చర్చ పెట్టటమే గాక గాంధీకి ఉత్తరం రాశారు. బాలికల విద్య, వైద్యం, వితంతు వివాహాల ప్రోత్సాహం లాంటి వివిధ సామాజిక అంశాలపై విశేషంగా కృషి చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, క్యాన్సర్ రోగుల సేవ, ఆ వ్యాధికి వైద్యం విషయాల్లో ఆమె కృషి అద్వితీయం. మద్రాసులోని అడయార్‌లో 1954లో 12 పడకలతో ఆమె ప్రారంభించిన క్యాన్సర్ వైద్యశాల ఈ రోజుకీ 600 పైగా పడకలు కలిగి, ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన వైద్యశాలగా విలసిల్లుతున్నది. ఈ వైద్యశాలకు 1952లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఇప్పుడు సంవత్సరానికి 80వేలకు పైగా రోగులకు ఈ ఆసుపత్రి వైద్యసేవలు అందిస్తున్నది. 1931లో అడయార్‌లోనే 'అవ్వై హోం' పేరిట ఆమె స్థాపించిన శరణాలయం మహిళలు ఆత్మగౌరవంతో స్వతంత్రంగా బతికేట్లుగా తోడ్పడుతోంది. ఇన్ని వ్యాపకాల మధ్య ఆమె 'స్త్రీ ధర్మ' అనే పత్రిక నడిపింది. 1930లో లండన్‌లో, 1932లో చికాగోలో ప్రపంచ మహిళా సాధికారిక సదస్సుల్లో పాల్గొని భారతీయ మహిళల స్థితిగతుల్ని ప్రపంచానికి చాటారు ముత్తులక్ష్మి. అఖిల భారత మహిళా సదస్సుకు 1931లో ఆమె అధ్యక్షత వహించారు. 'శాసన సభలో నా అనుభవాలు', 'స్వీయ జీవిత చరిత్ర' ఆమె చేసిన రచనలు. కానీ అవి అందుబాటులో లేవు. 1968 జూలై 22న జీవితం చాలించిన డా. ముత్తు లక్ష్మిరెడ్డికి 1956లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చినా, ఆమె సేవల ముందు అది చాలా చిన్నదే. కానీ దేశంలో వినిపిస్తున్న యువత అసంతృప్తి స్వరాలు వింటుంటే రాజకీయాల్లో మార్పు సాధ్యమేమో అనిపిస్తున్నది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 'నిరుద్యోగ బొద్దింకలు' కామెంట్ యువతలో కదలిక తీసుకువచ్చింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' దేశంలోని అసంతృప్తి స్వరాలకు కేంద్రంగా మారింది. ఈ పార్టీ ఒక రాజకీయ పార్టీ కాదు, ఎన్నికల్లో పోటీ చేయదు, కానీ అధికారపక్షం అవకతవకలను జనంలోకి తీసుకువెళ్లడంలో, ప్రజల్లో చర్చను లేవనెత్తడంలో విజయం సాధించింది. 'నేను నియంతను' అని చెప్పకుండానే నియంతలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ పార్టీ కంటగింపుగా మారింది. ప్రజాస్వామ్యాన్ని అమితంగా ప్రేమించిన నెహ్రూ కన్నా ఎక్కువ కాలం అధికారంలో మోదీ ఉన్నారని ఇటీవల గర్వంగా ప్రచారం చేసుకున్నారు. సంవత్సరాల లెక్క ప్రకారం ఎక్కువకాలం నిజమే. కానీ విలువల విషయంలోనూ పోలిక ఉండాలి కదా? నెహ్రూ తన మీద కార్టూన్‌లు వేస్తే కార్టూనిస్టుకు ఫోన్ చేసి అభినందించేవారు. తన పాపులారిటీ రోజురోజుకూ పెరిగిపోతుండడంతో నియంతగా మారుతానేమోనని ఆయనకే అనుమానం వచ్చి తన ప్రభుత్వాన్నే తీవ్రంగా విమర్శిస్తూ మారుపేరుతో తానే వ్యాసాలు రాసుకున్నారు. అలాంటి నెహ్రూ కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉన్న మోదీ మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు 'నేను సమాధానం చెప్పడం ఏమిటి?' అన్నట్టు అధికారంలోకి వచ్చి 13 ఏండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా మీడియా సమావేశంలో మాట్లాడలేదు. 'మౌనముని' అని మీడియా ఎగతాళి చేసినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం తరచూ మీడియా సమావేశాలు నిర్వహించి, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు. ప్రజాస్వామ్య దేశాల పాలకులు మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు, నియంత కిమ్ జాంగ్ ఉన్ 2019లో హనాయ్ సమ్మిట్‌లో విదేశీ జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

# పెద్ద చదువుల్లో... ప్రమాణాలు పెరుగుతాయా?




ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకోసం కేంద్రం నిరుడు 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఆ బిల్లుపై చర్చ సందర్భంగా పలు విమర్శలు తలెత్తడంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపారు. జేపీసీ అధ్యయనం నేపథ్యంలో ప్రతిపాదిత బిల్లుపై విద్యావేత్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత విద్యారంగాన్ని సంస్కరించే ప్రయత్నాన్ని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్ల క్రితమే ప్రారంభించింది. అది అకడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), స్వయం కోర్సుల రూపకల్పన, నేషనల్ డిజిటల్ లైబ్రరీ, ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎమినెన్స్ వంటి వాటి రూపకల్పనకు దారితీసింది. వీటన్నింటికీ ఒక సమగ్ర రూపాన్ని ఇచ్చేందుకు కేంద్రం 2020లో జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించింది. ఉన్నత విద్యను క్రమబద్ధీకరించడానికి ఒక సంస్థాగత నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ఆ క్రమంలో నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషనల్ రెగ్యులేటరీ అథారిటీని స్థాపించాలని ప్రయత్నించింది. దీనికే ఆ తరువాత 'హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'(హెచ్‌ఈసీఐ)గా నామకరణం చేసింది. దాంతోపాటు విశ్వవిద్యాలయాలను బోధన, పరిశోధక సంస్థలుగా వర్గీకరించాలని, కళాశాల అనుబంధ పద్ధతిని తొలగించి వాటికి పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించాలని తలపోసింది. అదే తరహాలో ఉన్నత విద్య నియంత్రణకు ఒక సంస్థను ఏర్పరచాలని భావించింది. ఆ దిశగా హెచ్‌ఈసీఐ ఏర్పాటుకు చర్యలు మొదలుపెట్టింది. అయితే, జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రకటించిన సంస్కరణలు నేటికీ చర్చల దశలో ఉన్నాయి. వాటికి 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(వీబీఎస్‌ఏ) బిల్లు' ద్వారా తుది రూపునివ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన!

### ప్రధాన సమస్యలకు పరిష్కారాలేంటి?

దేశంలోని వర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల బోధన, పరిశోధన, ఆవిష్కరణ, సమన్వయం తదితరాల్లో అత్యున్నత ప్రమాణాలు సాధించేందుకు అవసరమైన వ్యవస్థను కొలువుతీర్చడమే వీబీఎస్‌ఏ లక్ష్యమని అప్పట్లో పార్లమెంటులో ప్రకటించారు. హెచ్‌ఈసీఐకి దీన్ని కొత్తపేరుగా చెప్పవచ్చు. ఈ అధిష్ఠాన్ ఆధ్వర్యంలో రెగ్యులేటరీ, అక్రిడిటేషన్, స్టాండర్డ్స్ కౌన్సిళ్లు అనే మూడు విభాగాలుంటాయి. ఉన్నత విద్య నియంత్రణ బాధ్యతలను ప్రస్తుతం యూజీసీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఏఐసీటీఈ నిర్వర్తిస్తున్నాయి. బిల్లు ప్రకారం అవి రద్దయ్యి, వాటి స్థానంలో రెగ్యులేటరీ కౌన్సిల్ ఏర్పాటవుతుంది. అయితే, ఏకీకృత వ్యవస్థ పేరుతో ఉన్నత విద్యపై కేంద్రం ఆధిపత్యం పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమన్వయం, ప్రమాణాల స్థిరీకరణ పేరుతో ఇప్పటికే ఉన్నత విద్యాసంస్థలపై రాష్ట్రాల అజమాయిషీని నామమాత్రం చేశారన్న వాదనలు ఉన్నాయి. ఈ విషయంగానే అటు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇటు ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ఐఐటీలు, ఐఐఎంలు, జాతీయ ప్రాధాన్యం కలిగిన సంస్థలు కూడా దీనికి అంతగా సుముఖంగా లేనట్లు చెబుతున్నారు. ఈ విషయంలో జేపీసీ ఎలాంటి పరిష్కారం ప్రతిపాదించిందో చూడాలి. బిల్లులోని రెండో అంశం అక్రిడిటేషన్ కౌన్సిల్ ఏర్పాటు. నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచి, స్థిరీకరించేందుకు జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాసంస్థలకు ర్యాంకులు, గ్రేడ్లు ఏర్పాటు చేసి అవి అంతర్జాతీయ ప్రమాణాలు అందుకునేలా ప్రోత్సహించడం అభిలషణీయమే. ప్రస్తుతం న్యాక్, ఎన్‌బీఏ వంటి సంస్థలు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాల కొలమానంలో వేటి నియమాలు, విధానాలు వాటికి ఉన్నాయి. ఈ విషయంలో అన్ని సంస్థలు విమర్శలు ఎదుర్కొంటున్నాయి. 'న్యాక్' సంస్థ రెండేళ్లుగా క్రియారహితంగా ఉంది. 'ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్'కు దేశంలోని ప్రతి ఉన్నత విద్యాసంస్థ తమ సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలన్న నిబంధన ఉంది. ఇలా సమాచారాన్ని కోరుతున్న సంస్థల్లో సారూప్యత లేదు. దాన్ని ఉపయోగించి, ఉన్నతవిద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తారన్న స్పష్టత కొరవడింది. ఇదంతా గందరగోళానికి దారితీస్తోంది. 'వన్ నేషన్ వన్ డాటా' అనే నినాదాన్ని తెరపైకి తెచ్చినా, దాని అమలుపై నేటికీ సందిగ్ధత నెలకొంది. వీటన్నింటినీ గమనంలోనికి తీసుకుని బిల్లును పకడ్బందీగా ఎలా రూపొందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

### సంస్థాగత మార్పులతో ప్రయోజనమెంత?

ఇక మూడో అంశం 'ప్రమాణాల స్థిరీకరణ'కు సంబంధించింది. బిల్లు ప్రకారం ఈ విధులను నూతనంగా ఏర్పరచబోయే 'స్టాండర్డ్స్ కౌన్సిల్' చూస్తుంది. వాస్తవానికి ఉన్నతవిద్యా ప్రమాణాల విషయంలో ఇంతవరకు దేశీయంగా పెద్దగా సాధించింది ఏమీలేదు. బాగా చర్చనీయాంశమైన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, దేశంలో పెద్దగా పట్టాలకెక్కిన దాఖలాలు లేవు. అలాగే ఇంజినీరింగ్ విద్యలో కంప్యూటర్ కోర్సులు మినహా మిగిలినవి ఎంపిక చేసుకునేవారు అంతగా ఉండటంలేదు. ఇక ఉపాధ్యాయ నైపుణ్య శిక్షణను సాధారణ విద్యతో మిళితం చేయాలనే సంకల్పం ఆచరణలో ఒక కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ప్రమాణాలు లేదా పాఠ్యాంశాల స్థిరీకరణ పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్నత విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ధోరణుల విషయంలో కేవలం సంస్థాగత మార్పుల వల్ల ఒనగూడే ప్రయోజనం పరిమితమే. ఆయా సంస్థలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, సమర్థంగా పనిచేసినప్పుడే ఈ రంగంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుంది. ఉన్నత విద్యకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న వ్యయం అతిస్వల్పం. ఆ రంగం మొత్తంగా కేంద్రం కనుసన్నల్లోకి వెళ్తే రాష్ట్రాలు నామమాత్రంగా మిగులుతాయి. ఇది ఆశించదగిన పరిణామం కాదు. వాస్తవానికి ఉన్నత విద్యారంగంలో వర్సిటీలు, విద్యార్థుల ప్రవేశాల పరంగా రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర గణనీయమైనదే. అందువల్ల రాష్ట్రాల భాగస్వామ్యం లేకపోతే ఉన్నత విద్యాసంస్థలు, ప్రమాణాలు ఇంకా దెబ్బతినే ప్రమాదముంది. కాబట్టి, ప్రతిపాదిత బిల్లుకు ఆమోదం తెలిపే ముందు పార్లమెంట్ ఈ కీలకాంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి.

# అర్హతలున్నా దక్కని పదోన్నతి స్కేలు

ప్రభుత్వ ఉత్తర్వులు ఎంత స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను, పదోన్నతులను సకాలంలో పొందలేకపోతున్నారు. ముఖ్యంగా 45 సంవత్సరాల వయసు దాటినప్పటికీ, డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాస్ కాలేదనే నెపంతో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేలు మంజూరుకు నోచుకోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో మంది ఉన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.225 (జీఏడీ), తేదీ: 18.05.1999, జీవో నెం.96 (ఫైనాన్స్), తేదీ: 20.05.2011ల ప్రకారం... 45 ఏళ్ల వయసు దాటిన వారికి డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణత నుండి స్పష్టమైన మినహాయింపు ఉంది. ఎప్పుడో జారీ అయినా ఈ జీవోలపై అధికారులకు అవగాహన కొరవడడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారింది.

### జీవో 225 ఏం చెబుతోందంటే..!?

తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996 లేదా ఇతర ప్రత్యేక, తాత్కాలిక నిబంధనలతో సంబంధం లేకుండా, 45 ఏళ్ల వయసు దాటిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొదటి నియామకం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఒక్క ప్రమోషన్ కూడా పొందకపోతే, తదుపరి ఉన్నత పోస్టు ప్రమోషన్ పొందేందుకు డిపార్ట్‌మెంటల్ టెస్టుల ఉత్తీర్ణత నుండి జీవో 225 ద్వారా మూడు షరతులకు లోబడి శాశ్వత మినహాయింపు లభిస్తుంది. ఫస్ట్ షరతు ఏంటంటే, మొదటి ప్రమోషన్‌కు మాత్రమే మినహాయింపు వర్తిస్తుంది. ఇప్పటికే ఒకసారి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు లేని పోస్టులోకి ప్రమోషన్ పొంది ఉంటే, ఆపై పోస్టుకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు తప్పనిసరి అయితే ఈ మినహాయింపు వర్తించదు. అకడమిక్ అర్హతలకు మినహాయింపు వర్తించదనేది రెండవ నిబంధన. ఈ మినహాయింపు కేవలం డిపార్ట్‌మెంటల్ లేదా స్పెషల్ టెస్టులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రమోషన్ పోస్టుకు అవసరమైన సాంకేతిక లేదా అకాడమిక్ విద్యార్హతలకు మాత్రం ఈ మినహాయింపు వర్తించదు. అవి తప్పనిసరిగా ఉండాలి. ప్రొబేషన్ డిక్లరేషన్‌కు వర్తించదనేది మూడో కండిషన్.

### ఎస్ఏలకు గెజిటెడ్ హెచ్ఎం ప్రమోషన్లు!




విద్యాశాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా చేరి, 45 ఏళ్ల వయసు దాటిన వారికి ఈ 225 జీవో ఒక సంజీవని లాంటిది. వీరికి అకడమిక్ విద్యార్హతలైన డిగ్రీ, బీఈడీ/పండిట్ ట్రైనింగ్/బీపీఈడీ మొదలైనవి ఉండి, డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాస్ కాకపోయినా, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని జీవో 225 నిర్దేశిస్తోంది. అదేవిధంగా, స్కూల్ అసిస్టెంట్‌గా నేరుగా నియామకమై, 45 ఏళ్ల వయసు దాటి 12 సంవత్సరాల సర్వీసు పూర్తి కాగానే 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేలును సైతం ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే మంజూరు చేయాలి.

### మోడల్ స్కూల్ టీచర్లకూ వర్తింపు

ఈ నిబంధనలు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సైతం వర్తిస్తాయి. మోడల్ స్కూళ్లల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, టీజీటీ, పీజీటీలకు 45 ఏళ్ల వయసు దాటి, ఒకే పోస్టులో 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేస్తే, డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా వారికి 12 సంవత్సరాల స్కేలును విధిగా మంజూరు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు ఇంత స్పష్టంగా, పారదర్శకంగా ఉన్నా వాటిని అమలు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడం సమర్థనీయం కాదు. అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వయోపరిమితి ఆధారంగా రావాల్సిన రెగ్యులర్ ప్రమోషన్లను, 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేల్‌ను అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా, ఒక హక్కుగా పోరాడి సాధించుకోవాలి. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 225, 96లను అర్హులైన వారికి సత్వరం అమలు చేసి న్యాయం చేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

# నియంతృత్వానికి యువత అడ్డుకట్ట!

నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలో యువత సాగిస్తున్న ఆందోళనలపై పోలీసులు విరుచుకుపడి లాఠీచార్జి చేశారు. దీనికి సంబంధించి యూట్యూబ్ చానల్స్ చూస్తుంటే జంతర్ మంతర్ వద్ద 20 ఏండ్ల యువతి ఒక్క నిమిషం మాట్లాడిన మాటలు వింటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా? అనిపించింది. కన్నీళ్లు ఉబికి వస్తుండడంతో ఆ యువతి మాటలు అస్పష్టంగా వచ్చాయి. 'పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఈ రోజు వీళ్లను పోలీసులు కొట్టడాన్ని చూశాక..నా నిర్ణయాన్ని మార్చుకున్నాను. నేను పోలీసునై ఉంటే వీళ్లలాగానే కొట్టాలి కదా? వీళ్లు చేసిన పాపం ఏమిటి? నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించాలని కోరడమే పాపమా? అంతలా లాఠీలతో కొడతారా? అంటూ ఆ యువతి కన్నీళ్లు పెట్టుకున్నది. నీట్ పేపర్ పదే పదే లీకవుతున్నా కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా? ప్రశ్నిస్తే నేరమా? ఇందిరాగాంధీ హయాంలో విధించిన 'ఎమర్జెన్సీ' గురించి పదే పదే ఉపన్యాసాలు ఇచ్చే కేంద్రంలోని బీజేపీ పాలకులు అంతకుమించిన నియంతృత్వంతో వ్యవహరిస్తున్నారు. ప్రజలకు పూచికపుల్ల కూడా విలువ ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. మనకు ఏదైతే అందుబాటులో ఉంటుందో దాని విలువ మనకు తెలియదు. స్వేచ్ఛ కోల్పోయే వరకు స్వేచ్ఛ విలువ తెలియదు. దేశంలోని పలు రాష్ట్రాల్లో పరిస్థితులు చూస్తుంటే మెల్లగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. నీట్ పేపర్ లీక్‌ను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా పాలకులకు పట్టడం లేదు. ఢిల్లీలో యువత మూడు వారాల నుంచి ఆందోళన చేస్తుంటే లాఠీఛార్జితోపాటు టియర్ గ్యాస్‌తో తీవ్రంగా హింసిస్తున్నారు. కానీ కోట్ల రూపాయల కుంభకోణం నీట్ లీకేజీకి బాధ్యత ఎవరూ తీసుకోవడం లేదు. నీట్ పేపర్ లీకేజీ మొదటిసారి కాదు..ఇదొక ఆనవాయితీగా మారింది. ఇందులో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసినంత మాత్రాన నీట్ పేపర్ లీకేజీ ఆగిపోతుందని కాదు. కానీ లీకేజీకి అమాత్యవర్యులు బాధ్యత వహించాలి కదా!. దేశంలో మోదీ ఏకస్వామ్య పాలన సాగిస్తుంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకులు అదే మార్గంలో వెళ్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిని వాడుకోవాలి, రైతులను ఆదుకోవాలి అని రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పడమే పాపం.. వారిని జైలు పాల్జేస్తాను, బెల్ట్ చికిత్స చేస్తాను అని స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఇలాంటి నియంతృత్వ వ్యాఖ్యలు గతంలో ఏ పాలకుడి నోటి నుంచి వినలేదు. తెలంగాణ సీఎంలా నోటిదురుసు ఆంధ్రా సీఎం చంద్రబాబుకు అస్సలు లేదు. కానీ మాట్లాడకుండానే ఆయన నియంతృత్వాన్ని అమలుచేస్తారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలనే ఒక యూట్యూబర్ ఇమిటేట్ చేస్తూ మాట్లాడగా అతనిపై వందల్లో కేసులు పెట్టారు. నాలుగుసార్లు బెయిల్ లభిస్తే ఐదవసారి ఉప కేసు పెట్టి మళ్లీ అరెస్ట్ చేశారు. మీడియా పార్టీల వారిగా బాధ్యతలు నిర్వహిస్తుంటే..యూట్యూబ్ చానల్స్‌తో పాలకులకు కంటగింపుగా మారింది. దానితో యూట్యూబ్ వారిని అరెస్టులు చేయిస్తూ అసంతృప్తి స్వరాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి చూసి రాష్ట్రాలు సైతం అదే మార్గంలో పయనిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించాలి. కానీ మనం క్రమంగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. ఒకసారి అధికారంలోకి వచ్చామంటే ఇక తాము ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా కొందరు పాలకులు వ్యవహరిస్తున్నారు.నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో యువత ఉద్యమిస్తుంటే 'చైనా కుట్ర' అని ప్రచారం చేసే స్థాయికి నాయకులు చేరారంటే నీట్ పేపర్ లీక్ చేసింది చైనానా? చైనా లీక్ చేస్తుంటే మన వ్యవస్థలు ఏం చేస్తున్నట్టు? ఎవరైనా ప్రభుత్వాన్ని తప్పుపడితే పాకిస్థాన్ ఏజెంట్ అంటున్నారు. ఉద్యమిస్తే చైనా కుట్రనట. రైలు ప్రమాదం జరిగితే పాకిస్థాన్ కుట్ర అంటూ వెంటనే ప్రచారం చేస్తారు. ఒకవేళ నిజంగానే పాకిస్థాన్ మన రైళ్లను ప్రమాదాలపాలు చేసి ఎంతోమంది ప్రాణాలు తీస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? గతంలో రైలు ప్రమాదాలు జరిగితే రైల్వే మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ వినిపించేది. ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతినేది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి వైఫల్యాలను కూడా పాకిస్థాన్ కుట్ర పేరుతో తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది. పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, జీడీపీ వృద్ధి వంటి అంశాలను వదిలేసి, మతం ఆధారంగా మళ్లీ మళ్లీ అధికారం హస్తగతం చేసుకోవాలనేది బీజేపీ వ్యూహం. కానీ దేశంలో వినిపిస్తున్న యువత అసంతృప్తి స్వరాలు వింటుంటే రాజకీయాల్లో మార్పు సాధ్యమేమో అనిపిస్తున్నది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 'నిరుద్యోగ బొద్దింకలు' కామెంట్ యువతలో కదలిక తీసుకువచ్చింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' దేశంలోని అసంతృప్తి స్వరాలకు కేంద్రంగా మారింది. ఈ పార్టీ ఒక రాజకీయ పార్టీ కాదు, ఎన్నికల్లో పోటీ చేయదు, కానీ అధికారపక్షం అవకతవకలను జనంలోకి తీసుకువెళ్లడంలో, ప్రజల్లో చర్చను లేవనెత్తడంలో విజయం సాధించింది. 'నేను నియంతను' అని చెప్పకుండానే నియంతలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ పార్టీ కంటగింపుగా మారింది. ప్రజాస్వామ్యాన్ని అమితంగా ప్రేమించిన నెహ్రూ కన్నా ఎక్కువ కాలం అధికారంలో మోదీ ఉన్నారని ఇటీవల గర్వంగా ప్రచారం చేసుకున్నారు. సంవత్సరాల లెక్క ప్రకారం ఎక్కువకాలం నిజమే. కానీ విలువల విషయంలోనూ పోలిక ఉండాలి కదా? నెహ్రూ తన మీద కార్టూన్‌లు వేస్తే కార్టూనిస్ట్‌కు ఫోన్ చేసి అభినందించేవారు. తన పాపులారిటీ రోజురోజుకూ పెరిగిపోతుండడంతో నియంతగా మారుతానేమోనని ఆయనకే అనుమానం వచ్చి తన ప్రభుత్వాన్నే తీవ్రంగా విమర్శిస్తూ మారుపేరుతో తానే వ్యాసాలు రాసుకున్నారు. అలాంటి నెహ్రూ కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉన్న మోదీ మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు 'నేను సమాధానం చెప్పడం ఏమిటి?' అన్నట్టు అధికారంలోకి వచ్చి 13 ఏండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా మీడియా సమావేశంలో మాట్లాడలేదు. 'మౌనముని' అని మీడియా ఎగతాళి చేసినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం తరచూ మీడియా సమావేశాలు నిర్వహించి, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు. ప్రజాస్వామ్య దేశాల పాలకులు మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు, నియంత కిమ్ జాంగ్ ఉన్ 2019లో హనాయ్ సమ్మిట్‌లో విదేశీ జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్లపై కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యమా..?

పునాదులకే పరిమితమైన నిర్మాణాలు

ప్రత్యేక ఏఈ ఉన్నా పర్యవేక్షణ కరువు..?

పేదల ఇంటి కలకు గండి.



తిర్యాని : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని చెలిమెల కొల్లంగూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన తొలి దశలోనే నిలిచిపోయాయి. పునాదులు వేసిన తర్వాత నెలలు గడుస్తున్నా నిర్మాణాలు ముందుకు సాగకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పునాదుల్లో నీరు నిలిచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామస్థుల కథనం ప్రకారం, కొంతమంది కాంట్రాక్టర్లు నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసి అసంపూర్తిగా వదిలేశారని ఆరోపిస్తున్నారు. దీంతో నిరుపేదల సొంతింటి కల నెరవేరక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. నిర్మాణ పనులపై కాంట్రాక్టర్లకు ఎలాంటి జవాబుదారీతనం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఏఈని నియమించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తిర్యాని ఎంపీడీవోను వివరణ కోరగా, కాంట్రాక్టర్లను పలుమార్లు సంప్రదించినప్పటికీ వారు స్పందించడం లేదని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాని లబ్ధిదారులు నేరుగా తమ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని, అందిన ఫిర్యాదులను పరిశీలించి జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తామని, అనంతరం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి గురికాకుండా నిలిచిపోయిన నిర్మాణాలను వెంటనే పునఃప్రారంభించి, బాధ్యులపై చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## బీజేపీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తిర్యానిలో కాంగ్రెస్ భగ్గుమంది

పేపర్ లీకేజీలు, విద్యార్థులపై లాఠీచార్జీ, ప్రతిపక్ష నేతల అవమానంపై తీవ్ర నిరసన



తిర్యాణి: : దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని, పేపర్ లీకేజీలతో యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం తిర్యాణి మండలంలోని కొమురం భీం చౌరస్తాలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేపర్ లీకేజీలపై ప్రశ్నించిన అమాయక విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. దేశ ప్రధాన ప్రతిపక్ష నాయకులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను అవమానించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చే చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అదేవిధంగా ఎస్ఐఆర్ పేరుతో బడుగు, బలహీన వర్గాల ఓట్లను తొలగించి మళ్లీ అధికారంలోకి రావాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రతి ఓటును కాపాడేందుకు గ్రామీణ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ప్రజల హక్కులను కాంగ్రెస్ పార్టీ పరిరక్షిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్, జిల్లా కార్యదర్శి కురిసెంగ శోభన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచందర్, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోడేఘాట్‌లో కుమురం భీమ్‌కు డీటీడీఓ నివాళులు, ఆశ్రమ పాఠశాల తనిఖీ



ఆసిఫాబాద్ : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) జాదవ్ అంబాజీ బుధవారం పర్యటించారు. చారిత్రాత్మక జోడేఘాట్‌లోని అమరవీరుడు కొమరం భీమ్ స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం కొమరం భీమ్ సాగించిన పోరాటం, చేసిన త్యాగాలు నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు డీటీడీఓకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, తరగతి గదులు, వసతి గృహం, భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యాభ్యాసం, ఆరోగ్యం, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్యూరేటర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ పేలి విద్యార్థికి తీవ్ర గాయాలు



ఆసిఫాబాద్ : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో బుధవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గూడెం గ్రామానికి చెందిన విద్యార్థి నికాడ లోకేష్ ఇంట్లో సెల్‌ఫోన్ వాడుతుండగా అది ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో అతని ముఖభాగానికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. చార్జింగ్‌లో ఉన్న సెల్‌ఫోన్‌ను వాడకుండా, నాణ్యమైన చార్జర్లు, బ్యాటరీలను మాత్రమే వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ భద్రతను కాపాడుకోవాలని విజ్ఞప్తి.

## ఆసిఫాబాద్ జిల్లా రాహుల్, ప్రియాంక అరెస్టులకు కాంగ్రెస్ నిరసన



ఆసిఫాబాద్ : నీట్ పరీక్ష వ్యవహారంపై నిరసన వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను ఖండిస్తూ ఆసిఫాబాద్లో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. పీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన నిరసనలో నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్‌నాయక్, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదని నాయకులు పేర్కొన్నారు.

## కొమరం భీం జిల్లాలో రహదారుల దుస్థితి..

పెరుగుతున్న ప్రమాదాలు

వర్షాలతో బురదమయమైన

గ్రామీణ రోడ్లు

రాకపోకలకు తీవ్ర అంతరాయం..

ప్రమాదాల ముప్పు





ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాకాలం ప్రారంభమైతే గ్రామీణ రహదారుల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ముఖ్యంగా వాంకిడి, కేరమెరి, తిర్యాణి, జైనూర్, సిర్పూర్(యూ), చింతలమానేపల్లి తదితర మండలాల్లో అనేక అంతర్గ్రామ రహదారులు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు జారి పడటం, ఆటోలు బురదలో కూరుకుపోవడం, అంబులెన్స్‌లు గ్రామాలకు చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తడం తరచూ జరుగుతోంది. రైతులు పంటలను మార్కెట్‌కు తరలించడంలో, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో, అత్యవసర వైద్య సేవలు పొందడంలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రమాదాలకు గురయ్యాక తాత్కాలిక మరమ్మతులు కాకుండా, దెబ్బతిన్న గ్రామీణ రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడం, నీటి పారుదల కాలువలు నిర్మించడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, నాణ్యమైన నిర్వహణ చేపట్టాలని కోరుతున్నారు. గ్రామీణ రహదారుల బలోపేతమే ప్రమాదాల నివారణకు, ప్రజల సురక్షిత ప్రయాణానికి శాశ్వత పరిష్కారమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## నూతన జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి రాజ్ గోండ్ సేవా సమితి సన్మానం



ఆసిఫాబాద్ : కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ నూతన జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీకి రాజ్ గోండ్ సేవా సమితి ఘనంగా సన్మానం నిర్వహించింది. జాతీయ అధ్యక్షులు సిడం అర్జు మాస్టర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. గిరిజనుల సంక్షేమం, విద్యాభివృద్ధి, సామాజిక పురోగతికి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, జిల్లా గిరిజన సంక్షేమ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ స్పందిస్తూ, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు అంకితభావంతో పనిచేస్తానని, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాలు, అధికారుల సహకారంతో సంక్షేమ కార్యక్రమాలను మెరుగ్గా అమలు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సార్మేడి అధ్యక్షులు కుర్సెంగా మోతిరామ్, కుమరం భీమ్ మనమడు కుమరం మాధవరావ్, రాజ్ గోండ్ సేవా సమితి కార్యవర్గ సభ్యుడు కూడ్మేత మారోతి, పీవీటీజీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భీంరావ్, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దనపల్లి భూసేకరణ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



మందమర్రి : కేకేటీసీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం పెద్దనపల్లి గ్రామంలో నాన్ ఫారెస్ట్ ల్యాండ్ (చీఫీఆ)కు సంబంధించి ప్రతిపాదించిన భూసేకరణ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ ఐఈఎస్ఎస్‌డీ మనోజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన పటాలు, సరిహద్దులను అధికారులతో కలిసి సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు స్థానిక రైతులు, నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు సంబంధించిన అంశాలను సమన్వయంతో పరిష్కరించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, కేకేటీసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సింగరేణి యాజమాన్య ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 54 మందికి ఉచిత కంటి ఆపరేషన్స్ విజయవంతం.





మంచిర్యాల. : తేది.20.07.2026 సోమవారం చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల సౌజన్యంతో, వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో మైనారిటీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం లో కంటి ఆపరేషన్ అవసరం ఉన్న 54 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. వారికి బుధవారం చెన్నూర్ కు తీసుకువచ్చి వారి స్వస్థలాలకు పంపామని చెన్నూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ నిమ్మల సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కంటి ఆపరేషన్స్ అయిన వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. వారికి కంటికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి రేకుర్తి డాక్టర్లు చెప్పిన విధంగా చుక్కల మందులు వాడాలని, తేది.27.07.2026 సోమవారం నాడు తప్పకుండా రేకుర్తి కంటి ఆసుపత్రికి వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఐ పేషంట్లకు బ్రెడ్ పంపిణీ చేశారు. ఐ పేషంట్లు ఆనందంతో మాట్లాడుతూ మా లాంటి నిరుపేదలకు ఇంత గొప్ప సేవ చేస్తున్న రేకుర్తి కంటి ఆసుపత్రి యాజమాన్యానికి, డాక్టర్లకు మరియు చెన్నూర్ లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్పర్సన్ లయన్ జాడి తిరుపతి, క్లబ్ కోశాధికారి లయన్ సౌడం శ్రీనివాస్, సభ్యులు జక్కుల సత్యనారాయణ,ఎన్నాం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సీఐ రవీందర్‌తో కలిసి సందర్శించిన ఆయన, సీసీ కెమెరాల ఏర్పాటు, భోజనశాల, వంటశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. బాలికల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటర్మీడియట్ బీపీసీ విద్యార్థులతో మాట్లాడి బోధన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై కూడా సమీక్ష నిర్వహించారు. మందమర్రి, బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, ఓటరు జాబితా సవరణ, భూభారతి, సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. తదనంతరం కాసిపేట, తాండూర్ ప్రాంతాల్లో సింగరేణి నూతన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రతిపాదిత స్థలాలను సంబంధిత అధికారులు, సింగరేణి జనరల్ మేనేజర్లతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితిలో వృత్తి శిక్షణ కోర్సులకు శిక్షకులు కావాలి

మందమర్రి, : సింగరేణి సేవా సమితి మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివిధ వృత్తి శిక్షణ కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు అర్హులైన శిక్షకుల (ట్రైనర్స్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్ తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ (3 నెలలు), కంప్యూటర్ డీటీపీ (2 నెలలు) కోర్సులకు శిక్షకులు అవసరమని పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో తగిన విద్యార్హత, శిక్షణ అనుభవం కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, అనుభవం, సంబంధిత కోర్సు అర్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేయాలని సూచించారు. ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను మందమర్రి జీఎం కార్యాలయంలోని జీఎం పీఏ (గ్రూ) సెక్షన్‌లో ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని అధికారులు తెలిపారు.

## జనావాసాల్లో చుక్కల దుప్పి,

సురక్షితంగా అడవిలో వదిలేసిన ఫారెస్ట్ అధికారులు.



మంచిర్యాల.: భీమారం మండల కేంద్రంలో జనవాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిని ఫారెస్ట్ అధికారులు పట్టుకొని సురక్షితంగా అడవిలో వదిలేశారు. బుధవారం ఉదయం కుక్కలు వెంటాడగా అడవిలో నుంచి వచ్చిన ఒక చుక్కల దుప్పి బీసీ బాయ్స్ హాస్టల్ లోకి వెళ్ళింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు జి . బానేష్, బి శ్రీకాంత్ ఎఫ్బి ఓ లు అక్కడికి చేరుకొని, గ్రామస్థుల సహాయం తో చుక్కల దుప్పి ని పట్టుకొని, క్షేమంగా అడవి లో వదిలి పెట్టారు..

## రైతులు ఎక్కువ ధరకు ఎరువులు కొనవద్దు

జిల్లా వ్యవసాయధికారి ఈ.సురేఖ



మంచిర్యాల జిల్లా : జైపూర్ మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారిణి ఇ.సురేఖ,సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ప్రసాద్,మండల వ్యవసాయ అధికారిణి సయ్యద్ ఖుదసియా గుల్రెజ తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీ లలో భాగంగా డి.ఏ.పీ., యూరియా,ఇతర ఎరువుల నిల్వలు,విక్రయ రికార్డులు,బిల్లులు,స్టాక్ రిజిస్టర్లు, ధరల ప్రదర్శన బోర్డులు మరియు రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి విక్రయ ధరలను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ..రైతులు ఎల్లప్పుడూ ఎరువులను బిల్లు తీసుకుని మాత్రమే కొనుగోలు చేయాలి.ఎం ఆర్ పి కంటే ఒక్క రూపాయి కూడా అధికంగా చెల్లించకూడదని,ఎవరైనా డీలర్ అధిక ధర వసూలు చేసినా లేదా బలవంతంగా ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.రైతులు కొనుగోలు చేసిన బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.అలాగే మండలంలోని అన్ని ఎరువుల డీలర్లకు యూరియా,డి.ఏ.పీ.తో పాటు అన్ని ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర ( ఎమ్మార్పీ) ప్రకారమే విక్రయించాలని,ప్రతి విక్రయానికి రైతులకు తప్పనిసరిగా కంప్యూటర్ బిల్లు/రసీదు ఇవ్వాలని,దుకాణంలో ఎరువుల నిల్వలు,ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని,ఎలాంటి పరిస్థితుల్లోనూ రైతుల నుండి అదనపు ధర వసూలు చేయరాదని,ఎరువులతో పాటు ఇతర వస్తువులను కొనుగోలు చేయాలని రైతులను బలవంత పెట్టొద్దని ఆదేశాలు జారీ చేశారు. ఫర్టిలైజర్ (కంట్రోల్ ) ఆర్డర్ ,1985 నిబంధనలను ఉల్లంఘించి ఎమ్మార్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించినట్లు లేదా ఇతర అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత డీలర్‌పై లైసెన్స్ సస్పెన్షన్, లైసెన్స్ రద్దు (కాన్సలేషన్), కేసుల నమోదు మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరించారు.వ్యవసాయ శాఖ రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని,రైతులు నిర్భయంగా తమ ఫిర్యాదులను సమీప వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని కోరారు.

## ధర్మారం గ్రామపంచాయతీలో మొక్కల పంపిణీ.





భీమారం.: భీమారం మండలం ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ మణి దీపక్ ఆధ్వర్యంలో ఇంటింటా ఆరు ముక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి మణిదీపక్, వార్డు సభ్యులు దాసరి నాగేందర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల కట్టడీ

రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



జైపూర్, : నేరాల నియంత్రణతో పాటు ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని,ప్రతి ఒక్కరూ వాటి ఏర్పాటుకు సహకరించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు.బుదవారంజైపూర్ ఎసిపి కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు,రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కొరకు సర్పంచులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు అత్యంత ప్రభావవంతమైన సాధనంగా నిలుస్తున్నాయని తెలిపారు. దొంగతనాలు, చోరీలు, ప్రమాదాలు ,ఇతర నేరాల దర్యాప్తులో సీసీ కెమెరాల ఫుటేజ్ కీలక ఆధారంగా ఉపయోగ పడుతోందన్నారు. అందువల్ల వ్యాపార సముదాయాలు ,దుకాణాలు,ఇళ్ల పరిసరాలు,ప్రధాన కూడళ్లు,ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీసు శాఖ చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు,వ్యాపారవేత్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఏసీపీ సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,అతివేగాన్ని నివారించాలని ట్రాఫిక్ సిగ్నళ్లను,రహదారి నియమాలను పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చన్నారు.చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత,ప్రమాదరహిత సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్,ఎంపీవో శ్రీపతి బాబురావు,స్థానిక ప్రజాప్రతినిధులు ,నాయకులు, పోలీసు సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## నింపిన ఎస్ఐఆర్ ఫారాలను వెంటనే బిఎల్‌ఓలకు అందజేయాలి:

తహశీల్దార్ అడా బిర్షా



జైనూర్, : నింపిన ఎస్ఐఆర్ ఫారాలను ఎవరూ తమ వద్దే ఉంచుకోకుండా వెంటనే సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలని జైనూర్ తహశీల్దార్ అడా బిర్షా, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావ్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కోడప ప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం జైనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ అడా బిర్షా మాట్లాడుతూ.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ఫారాలను సమర్పించే సమయంలో అవసరమైన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా జతచేయాలి. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బిఎల్‌ఓలను గానీ, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గానీ సంప్రదించవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఫారాలను సమర్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు చిర్లె లక్ష్మణ్, షేక్ రషీద్, మండల సీనియర్ నాయకుడు మెస్రం అంబాజి, ఉపసర్పంచ్ దాంగ్రే ప్రకాష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఫేరోజ్ ఖాన్, బిఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815